సాక్షి పెద్దపల్లి

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



న్యాయవాదుల నిరసన

సుల్తానాబాద్: సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కోర్టు ఎదుట నిరసన తెలిపారు. తమ రక్షణకు చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు.



అట్టహాసంగా రెస్క్యూ పోటీలు

గోదావరిఖని : సింగరేణి మెయిన్ రెస్క్యూ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. రెస్క్యూ టీంలు హాజరయ్యాయి.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

యూరియా కొరత.. తీరని వ్యథ



సుల్తానాబాద్‌లో చెప్పులు, రాళ్లు, చెట్ల కొమ్మలు, సామగ్రి పెట్టిన రైతులు



గుంజపడుగులో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు



సుల్తానాబాద్‌లో భోజనం చేస్తున్న మహిళా రైతులు

సుల్తానాబాద్/ఎలిగేడు/మంథనిరూరల్ : జిల్లా రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. బుధవారం కూడా వివిధ ప్రాంతాల్లో యూరియా కోసం ఉదయమే రైతులు బారులు తీరారు. అయినా, సరిపడా అందక చాలామంది వెనుదిరిగారు. సుల్తానాబాద్ ప్యాక్స్ గోదాం ఎదుట రైతులు చెప్పులు, రాళ్లు, చెట్లకొమ్మలను క్యూలో ఉంచారు. యూరియా వస్తుందనే సమాచారంతో మహిళా రైతులు కూడా భోజనాలు పట్టుకుని వచ్చారు. వరి పంట పొట్టదశకు వచ్చిందని, ఇప్పుడు యూరియా వేయాల్సి ఉంటుందని రైతులు తెలిపారు. మంథని మండలం గుంజపడుగు, ఎలిగేడు మండలం ధూళికట్టలోనూ అన్నదాతలు బారులు తీరారు.

న్యూస్‌రీల్

వీరవనితకు ఘననివాళి



నివాళి అర్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత, ధీరశాలి చాకలి ఐలమ్మ అని అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు



సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య, అధికారులు

రామగిరి(మంథని): పంచాయతీ అధికారులు, కార్యదర్శులు పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వీరబుచ్చయ్య హెచ్చరించారు. కల్వచర్ల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులు పరిశీలించారు. క్లోరినేషన్ చేపట్టాలని, మురుగునీటికాలువలు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతీవారం చేపట్టే డ్రై డేలో అధికారులు పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఉమేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్జీఎఫ్ పోటీలు



క్రీడాకారులతో డీవైఎస్‌వో సురేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చేపట్టిన జోనల్ స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా డీవైఎస్‌వో సురేశ్ మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా నైపుణ్యం పెంచుకోవాలని ఆయన సూచించారు. సుల్తానాబాద్, ఓదెల, జూలపల్లి, ఎలిగేడు మండలాలకు చెందిన 800 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. విజేతలకు సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు అమిరిశెట్టి తిరుపతి, దాసరి రమేశ్, ప్రణయ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎల్ఎం మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. మండలస్థాయి మేళాలో ప్రతిభ కనబర్చిన 10మంది ఉపాధ్యాయులు(ప్రతీ మండలం నుంచి) జిల్లాస్థాయి మేళాలో పాల్గొంటారని డీఈవో పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన 8 మందిని రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక చేస్తామని వివరించారు.

గూగుల్ పేలో ఉద్యోగాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు గూగుల్ పే హైరింగ్ రిక్వెస్ట్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 16న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని రూం నంబరు 225లో నిర్వహించే ఈ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్ వెంట తీసుకు రావాలని సూచించారు. వివరాలకు 80964 34123, 81212 62441 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైల్వే ట్రాక్ పనుల పరిశీలన

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట, ఓదెల, పొత్కపల్లి, కొలనూర్ రైల్వేస్టేషన్ల మధ్య చేపట్టిన రైల్వే ట్రాక్ పనులను దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. రైళ్ల వేగం పెంచేందుకు కొద్దిరోజులుగా ట్రాక్‌కింద కొత్త సిమెంట్ స్లీపర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల ప్రగతి తెలుసుకునేందుకు డీఆర్ఎం ఓదెలకు ప్రత్యేక రైలులో చేరుకున్నారు. స్లీపర్ మార్చే పనులను ఆయన పర్యవేక్షించారు. ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టం అమలు కోసం చేపట్టిన కొత్త పట్టాలు, స్లీపర్ పనులను వేగవంతం చేయాలని డీఆర్ఎం సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.

జీజీహెచ్ వర్సెస్ 'సిమ్స్'

- ప్రభుత్వ ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్‌లో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జోక్యం
- ప్రిన్సిపాల్ పెత్తనంపై ఫ్యాకల్టీ వైద్యుల నిరసన
- మెడికల్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసిన వైనం
- ఫ్యాకల్టీ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న జీజీహెచ్‌లోని ఫ్యాకల్టీ డాక్టర్లు

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాకు గుండెకాయలాంటి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)వైద్యాధికారులు, సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) కాలేజీ ప్రిన్సిపాల్ మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోందని తెలుస్తోంది. జీజీహెచ్ పరిపాలనా విభాగంలో ప్రిన్సిపాల్ జోక్యం మితిమీరుతోందని సుమారు 33 మంది ఫ్యాకల్టీ డాక్టర్లు తప్పుపడుతున్నారు. దీనిపై బుధవారం మెడికల్ సూపరింటెండెంట్‌ను వారు నేరుగా కలిసి వినతి పత్రం సమర్పించడం రామగుండం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ డాక్టర్ల సమస్యల పరిష్కారంతోపాటు తమ విధుల నిర్వహణకు ఇబ్బందులు కలిగిస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వ్యవహారంపై కూడా చర్యలు తీసుకోవాలని వినతిత్రంలో పేర్కొనడం కలకలం రేపుతోంది.

టీజీజీడీఏకూ ఫిర్యాదు..

జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్‌తోపాటు తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ), కరీంనగర్ టీజీజీడీఏ యూనిట్, రాష్ట్ర టీజీజీడీఏ, డీఎంఈకి కూడా ఫ్యాకల్టీ వైద్యులు ఫిర్యాదు చేయడం సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్‌లో సిమ్స్ ప్రిన్సిపాల్ అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొనడం ఆసక్తి రేపుతోంది. ఆస్పత్రిలో మితిమీరుతున్న ప్రిన్సిపాల్ జోక్యం సూపరింటెండెంట్ సామర్థ్యాన్ని అగౌరవపరుస్తోందని, ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డాక్టర్లకు ఇబ్బందులు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖగుర్తింపు హాజరు అమలులో ఉన్నా.. రిజిష్టర్లు ఎందుకు?

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ముఖగుర్తింపు హాజరు పద్ధతి అమలులో ఉన్నా.. అటెండెన్స్ రిజిష్టర్ ఎందుకనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఈ విషయంలో రిజిష్టర్ తొలగించాలని ఫ్యాకల్టీ వైద్యులు కోరుతున్నారు. ప్రతీవిభాగం హెచ్‌వోడీలే అటెండెన్స్ రిజిష్టర్ నిర్వహించి ప్రతీనెల 20వ తేదీలోగా సమర్పించాలని విన్నవిస్తున్నారు. ఆస్పత్రిలోని ప్రధాన వర్క్ స్టేషన్లలో ఇంటర్‌కం టెలిఫోన్ సౌకర్యం కల్పించాలని, ఎస్ఆర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వివరాలను ఈఎండీ డ్యూటీ రిజిష్టర్‌లో నమోదు చేయాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

అవమానం.. అగౌరవం..

పేషెంట్లు, మెడికల్ స్టూడెంట్స్, వైద్య సిబ్బంది ఎదుట అసిస్టెంట్ ప్రొఫెసర్లను అవమానిస్తున్నారని, అగౌరవ పర్చుతున్నారనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. తమను బ్లాక్‌మెయిల్ చేసేలా చర్యలు ఉండకూడదని డిమాండ్ చేస్తున్నారు. వివక్ష లేకుండా సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఫ్యాకల్టీ వైద్యులు కోరుతున్నారు.

ఫ్యాకల్టీలపై పనిభారం..

ప్రస్తుత ఫ్యాకల్టీపై పనిభారం పెరుగుతోంది. దానిని తగ్గించడానికి ఎన్ఎంయూ నిబంధనల మేరకు వీలైనంత త్వరగా ఫ్యాకల్టీలు, సీనియర్ రెసిడెంట్లను నియమించాలనే డిమాండ్ వస్తోంది. సీజనల్ వ్యాధులతో పేషెంట్ల సంఖ్య పెరిగిందని, బెడ్ల కొరత వేధిస్తోందని, వెంటనే బెడ్ల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ఉంది. కొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెగ్యులర్ వేతనాలు సమయానికి అందడం లేదని వాపోతున్నారు. అన్ని విభాగాల్లో వైద్యులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

గోదావరి పుష్కరాలకు కార్యాచరణ

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జరిగే గోదావరి పుష్కరాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, వేణుతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు వచ్చే ప్రదేశాలను గుర్తించి స్నానఘాట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సుందిళ్ల, గోదావరిఖని సమ్మక్క, సారలమ్మ, మంథనిలోని గౌతమేశ్వర ఆలయం, గోయిల్‌వాడ ప్రాంతాలకు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశముందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పనితీరు సరిగ్గాలేదని, పనితీరు మెరుగుపర్చుకోకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా చేస్తే ఉండాలని, లేదంటే సెలవుపై వెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నరేందర్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, ఆర్డీవో గంగయ్య, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, జిల్లా సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి వేణుగోపాల్‌రావు, సీడీపీవోలు అలేఖ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ఆయన ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదులు నిర్మిస్తామన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, ఓదెల నుంచి పెగడపల్లి గ్రామం వరకు తారురోడ్డు నిర్మిస్తామన్నారు. మల్లన్న గుడికి ఫోర్‌లేన్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆలయ ఏసీ సుప్రియ, టెంపుల్ చైర్మన్ చీకట్ల మొండయ్య, ప్రతినిధులు ఆళ్ల సుమన్‌రెడ్డి, తిరుపతి, ధీరజ్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరభద్రయ్య ఆధ్వర్యంలో కలెక్టర్, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు.

అందుబాటులో యూరియా

రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కొలనూర్‌లో యూరియా గోదామును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, నాయకులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, గోలి అంజిరెడ్డి, బైరి రవిగౌడ్, బొంగోని రాజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం అంటే ఇదేనా?

- యూరియా కోసం అన్నదాతలు రోడ్డెక్కాలా?
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పాలకులు మాయమాటలు చెప్పి రైతులు, ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకుని సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మండిపడ్డారు. యూరియా కొరతను సత్వరమే తీర్చాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు.. యూరియా కావాలంటూ రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఎందుకొచ్చిందో చెప్పాలన్నారు. కేసీఆర్ పాలనలో విత్తనాలు, ఎరువులు, విద్యుత్‌ను ఇబ్బందులు లేకుండా అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలకు పాలించడం చేతకాదని దుయ్యబట్టారు. సన్నవడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వడంలేదని, వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. పంటలకు యూరియా వేసే సమయం ఇదే అనువైందని, వెంటనే అవసరమైనంత యూరియా అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్, రఘువీర్ సింగ్, గంట రాములు, తిరుపతిరెడ్డి, సంపత్, మోహన్‌రావు, గుణపతి, వెంకటరెడ్డి, మొబిన్, రాములు, ముత్యాల రాజయ్య, దేవయ్య, మనోజ్, శ్రీధర్, మల్లేశం, ఖదీర్, విక్రమ్ పాల్గొన్నారు.

చదువు నేర్పిన బడి అభివృద్ధికి కృషి



జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటున్న ఎమ్మెల్సీ

పెద్దపల్లిరూరల్: 'నేను చదువు నేర్చుకున్నది ఈ పాఠశాలలోనే.. కష్టపడి చదివితే ఉన్నతంగా ఎదగొచ్చు.. మీరంతా క్రమశిక్షణతో లక్ష్య సాధనకు పాటుపడాలి' అని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య విద్యార్థులకు సూచించారు. అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో తన జ్ఞాపకాలు పంచుకున్నారు. బందంపల్లి నుంచి అప్పన్నపేట వరకు నడుచుకుంటూ వచ్చిన ఆనాటి జ్ఞాపకాలను వివరించారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని, విద్యార్థులు సెల్‌ఫోన్‌లతో కాలయాపన చేయకుండా ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని సూచించారు. ఓ విద్యార్థిని మీరు.. పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా ఎందుకు ఉండడం లేదని అడగ్గా.. కష్టాల నుంచి ఒక్కోమెట్టు ఎక్కుతూ ఉన్నతంగా ఎదిగానని, ఆ కారణంగా జాతీయ పార్టీ నాయకులు తనకు ఎమ్మెల్సీగా పోటీచేసేందుకు అవకాశం ఇచ్చారని కొమురయ్య బదులిచ్చారు. తాను చదువుకున్న బడిలో మీరు చదువుకుంటున్నారని, మీకు అవసరమైన వసతుల కల్పనకు సహకారం అందిస్తానని ఆయన అన్నారు. పాఠశాల మైదానం చదును చేయించడంతోపాటు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధనకు ట్యూటర్ కావాలని విద్యార్థులు విన్నవించగా.. సానుకూలంగా స్పందించారని, విద్యార్థులకు డ్యూయల్ డెస్క్‌లను కూడా సమకూరుస్తానని హామీ ఇచ్చారని హెచ్ఎం పురుషోత్తం తెలిపారు.

17 నుంచి మహిళా వైద్యశిబిరాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మహిళల ఆరోగ్యం కోసం ఈనెల 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలను స్వస్థ్ నారీ శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం పేరిట నిర్వహిస్తామని జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ బుధవారం తెలిపారు. మహిళలు, యుక్తవయసుగల వారికే వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి గైనకాలజిస్ట్, డెంటల్ తదితర వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు.

సింగరేణిలో మహిళాగార్డులు

- యువతులను నియమించే అవకాశం
- తొలిదశలో 150 మంది ఎంపిక
- త్వరలోనే నోటిఫికేషన్ జారీ



మహిళా సెక్యూరిటీ గార్డులు(ఫైల్)

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం మళ్లీ మహిళా సెక్యూరిటీ గార్డుల నియామకానికి రంగం సిద్ధం చేస్తోంది. సంస్థలో ప్రస్తుతం సుమారు 2వేల మందికిపైగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ జనరల్ అసిస్టెంట్లుగా బాధ్యతలు అప్పగించింది. చదువుతో నిమిత్తం లేకుండా వీరు వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధానంగా వర్క్‌షాప్‌లు, జీఎం కార్యాలయాలు, భూగర్భ గనులు, స్టోర్స్, డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్నారు. తాజాగా 150 మంది మహిళా కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు యాజమాన్యం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దీనిపై నోట్‌ఫైల్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సింగరేణి సంస్థ ఆమోదం తర్వాత నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. ఆ తర్వాత ఆసక్తిగల మహిళలను ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఐదేళ్ల క్రితం వరకు సెక్యూరిటీ గార్డులుగా..

ఐదేళ్లక్రితం వరకు మహిళలు సెక్యూరిటీ విభాగంలో పనిచేశారు. అయితే ఉద్యోగవిరమణ పొందడంతో వారిస్థానంలో కొత్తవారిని నియమించలేదు. గతంలో ఉద్యోగం చేస్తూ మరణించిన కార్మికుడి భార్య, వారి కుటుంబంలోని మహిళలకు సింగరేణి యాజమాన్యం ఉద్యోగం ఇచ్చే ఆనవాయితీ కొనసాగింది. వీరిని తొలుత గుట్కా(క్లైఫిల్)షెడ్లలో నియమించింది. ఆ తర్వాత జనరల్ మజ్దూర్లుగా విధులు అప్పగించింది. క్లైఫిల్ షెడ్లు ఎత్తివేయడంతో అందులో పనిచేస్తున్న మహిళా కార్మికులను సెక్యూరిటీ విభాగంలోకి తీసుకుంది. ఇలా ప్రతీ ఏరియాలో ఐదు నుంచి పది మంది వరకు మహిళలు సెక్యూరిటీ విభాగంలో కొనసాగారు. ప్రస్తుతం మహిళా కార్మికుల్లో కొందరిని సెక్యూరిటీ గార్డులుగా ఎంపిక చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

ప్రముఖ విద్యాలయంగా శాతవాహనకు గుర్తింపు

- వీసీ ఉమేశ్‌కుమార్



మాట్లాడుతున్న వీసీ ఉమేశ్‌కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీ 2008లో స్థాపించబడి ఉత్తర తెలంగాణలోనే ప్రముఖ విద్యాలయంగా గుర్తించబడుతుందని వీసీ ఉమేశ్‌కుమార్ ఉన్నారు. యూనివర్సిటీ గురించి ప్రపంచానికి తెలిసేలా తన పర్యటన కొనసాగిందని వివరించారు. ఆగస్టు 17 నుంచి 31 వరకు అమెరికా పర్యటన వివరాలను బుధవారం వెల్లడించారు. భిన్న కోర్సులతో నాలుగు పీజీ సెంటర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ, పరిశోధన, విద్యారంగంలో మెరుగైన అవకాశాలకు ఎన్ఆర్ఐ సాయం కోసం అమెరికాలోని 7 ప్రముఖ నగరాలను సందర్శించి విరాళాలు సేకరించామన్నారు. 8 బంగారు పతకాలతో పాటు రూ.అర కోటికి పైగా విరాళాలు సేకరించినట్లు తెలిపారు. సాంకేతిక అభివృద్ధి కోసం కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలు అందజేసేందుకు ఎన్ఆర్ఐలు ముందుకొచ్చినట్లు ఆయన తెలిపారు. నవంబర్ రెండోవారంలో విశ్వవిద్యాలయంలో 2వ స్నాతకోత్సవ వేడుకలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

అర్ధాకలితో చదువుకునేదెలా?

- జూనియర్ కాలేజీల్లో అమలుకు నోచుకోని 'మధ్యాహ్న భోజనం'



సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పేద, మధ్య తరగతికి చెందినవారే ఉంటారు. వీరు మారుమూల ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాల ద్వారా కళాశాలలకు చేరుకుంటున్నారు. చదువుపై ఆసక్తితో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆకలి బాధలు తప్పడం లేదు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. కానీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఇంకా అందుబాటులో తేవడం లేదు. వీరికోసం ప్రభుత్వం గతేడాది ఇచ్చిన హామీని అమలు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

14 కళాశాలలు.. 3,286 మంది విద్యార్థులు

జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో 3,286 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చి చదువు పూర్తయ్యాక ఇళ్లకు వెళ్తుంటారు. ఉదయం ఎనిమిది గంటలకు గ్రామీణ ప్రాంతాల్లోని తమ ఇళ్ల నుంచి బయలు దేరే విద్యార్థులు.. ఉదయం తొమ్మిది గంటలకు ఆర్టీసీ బస్సుల్లో కాలేజీలకు చేరుకుంటున్నారు. అప్పటికే ఫస్ట్‌పీరియడ్ ముగుస్తోంది. దీంతో విద్యార్థులు అంతకన్నా ముందుగానే తయారై కాలేజీ బాటపట్టడంతో ఇంటివద్ద భోజనం కానీ, అల్పాహారం కానీ చేసే అవకాశం ఉండడంలేదు. సాయంత్రం కాలేజీ ముగిశాక సకాలంలో బస్సులు రాక రాత్రి ఏడు గంటల వరకు ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. దీంతో చాలామంది మధ్యాహ్న భోజన తినక ఖాళీకడుపుతోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు బిస్కెట్లు, స్నాక్స్‌తో ఆకలి తీర్చుకుంటున్నారు. టిఫిన్ బాక్స్ తెచ్చుకునే కొందరు స్నేహితులతో పంచుకొని తింటున్నారు. అర్ధాకలితో బాధపడే విద్యార్థుల ఆరోగ్యంపై ఇది ప్రభావం చూపే అవకాశం ఉందని న్యూట్రిషన్లు చెబుతున్నారు. ఆకలి తట్టుకోలేక కొందరు ఇంటికి వెళ్లి పోతే.. ఏకాగ్రత దెబ్బతింటుందని అధ్యాపకులు వివరిస్తున్నారు.

బాక్స్ తేకుంటే పస్తులే



మా ఊరు నుంచి కాలేజీకి వచ్చేందుకు బస్సు సౌకర్యం ఒక్కటే ఉంది. పొద్దున ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయలుదేరితేనే బస్సు అందుతుంది. అప్పటివరకు భోజనం తయారైతే బాక్స్ తెచ్చుకుంట. లేకుంటే ఆరోజు పస్తులే. ఇంటికి వెళ్లే వరకు రాత్రి ఏడు గంటలవుతుంది.

– చింతల భవాని, ఇంటర్ సెకండియర్

రాధాకృష్ణన్ గెలుపుపై సంబురాలు



సంజీవరెడ్డికి మిఠాయి తినిపిస్తున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): భారత ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎన్నిక కావడంపై బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం సంబురాలు నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ, అవినీతిపై నీతి విజయం సాధించిందన్నారు. అనంతరం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు గుర్రాల మల్లేశం, కడారి అశోక్‌రావు, నల్ల మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, చాతరాజు రమేశ్, తిరుపతి, రాజన్న, కుమార్, నాగరాజు, భాగ్యలక్ష్మి, వనజ, నాగేశ్వర్, ఏగోళం సదయ్యగౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం బహిర్గతం.. అవమానంతో ఆత్మహత్య

ముత్తారం(మంథని): వివాహేతర సంబంధం బయటపడిందనే అవమానభారంతో మచ్చ నరేశ్(32) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నరేశ్ – స్వాతి దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేశ్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భార్యతో తరచూ గొడవపడుతున్నాడు. ఇటీవల భార్యను కొట్టి పిల్లలతో పుట్టింటికి పంపించాడు. ఆ తర్వాత వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళతో ఉండగా.. విషయం తెలుసుకున్న స్వాతి తన సోదరుడితో కలిసి మంగళవారం రాత్రి తన భర్తను, ఆ మహిళను పట్టుకుంది. ఆ తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్ భర్త, మహిళపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించివేశారు. అయితే, భర్త తనకు వద్దని భావించిన స్వాతి.. పెద్దపల్లిలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి బుధవారం ఉదయం వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న నరేశ్.. అవమానం భరించలేక మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త చావుకు కారణమైన మహిళపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మధునయ్య తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

బుగ్గారం: న్యాపూర్‌కు చెందిన పరుమాల గంగారాజం (58) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. గంగారాం కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. విరక్తి చెందిన ఆయన బుధవారం ఉరేసుకున్నాడు.

విషజ్వరంతో యువకుడు..

రామగిరి(మంథని): రత్నాపూర్ గ్రామానికి చెందిన జక్కుల సతీశ్(28) విషజ్వరంతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వారంరోజుల క్రితం సతీశ్‌కు జ్వరంరాగా కమాన్‌పూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినా జ్వరం తగ్గలేదు. దీంతో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.



సతీశ్ (ఫైల్)

బాధ్యతల తొలగింపు

కరీంనగర్: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్) రీజనల్ లెవల్ కో ఆర్డినేటర్‌గా కొనసాగుతున్న కనపర్తి సురేశ్‌ను బుధవారం ఆర్‌ఎల్‌సీ బాధ్యతల నుంచి తొలగిస్తూ టీఎంఆర్ఈఐఎస్ రాష్ట్ర సెక్రటరీ షఫీఉల్లా ఉత్తర్వులు జారీ చేశారు. సురేశ్‌పై నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల పట్ల సరిగా వ్యవహరించకపోవడం తదితర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. ఆరోపణలు నిజమేనన్న నివేదికను జిల్లా కలెక్టర్.. రాష్ట్ర మైనార్టీ సెక్రటరీకి పంపడంతో సురేశ్‌ను తొలగించి కరీంనగర్ పట్టణంలోని బాలురు-2 మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

పండుటాకులకు ఎంత కష్టం!

కొడుకులకు తల్లిదండ్రులు భారమయ్యారు.. అల్లారుముద్దుగా పెంచినవారిని వృద్ధాప్యంలో ఆదరించి అక్కున చేర్చుకోవాల్సిన తనయులు కనికరం లేకుండా వ్యవహరించారు.. ఒకరు అమ్మానాన్నకు పట్టెడు అన్నం పెట్టకుండా ఇబ్బందిపెట్టగా.. మరో ఇద్దరు మానవత్వం లేకుండా తల్లికి పశువుల పాకను నివాసంగా మార్చారు..

అన్నం పెట్టని కొడుకు



పోలీస్‌స్టేషన్ ముందు కూర్చున్న భూమయ్య దంపతులు

జగిత్యాలక్రైం: కొడుకు అన్నం పెట్టడంలేదని, అడిగినా పట్టించుకోవడంలేదని జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన బొల్లె భూమయ్య, కొమురవ్వ దంపతులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. భూమయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు గతంలో మరణించాడు. పెద్ద కుమారుడు రెండు నెలలుగా అన్నం పెట్టకపోవడంతో దంపతులిద్దరూ బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో కాలం వెళ్లదీశారు. తమకు అన్నం పెట్టడం లేదని, న్యాయం చేయాలని కోరుతూ రూరల్ ఎస్సై సదాకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వారి పెద్ద కొడుకు, చిన్న కొడుకు కుటుంబ సభ్యులను పిలిచించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వృద్ధుల పోషణభారం చూసుకోవాలని, మరోసారి విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువుల పాక నివాసమై..



అమృతమ్మ వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): కని పెంచిన తల్లి కొడుకులకు భారమైంది. కనికరం లేని కొడుకులు తల్లిని ఎడ్లపాకలో నివాసం ఉంచారు. దీంతో ఆ తల్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం బోగంపాడు గ్రామంలో జరిగింది. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో రమేశ్‌బాబు, అధికారులు స్పందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, సఖి కౌన్సిలర్ పద్మావతి భోగంపాడులో ఎడ్లపాకలో నివాసం ఉంటున్న వృద్ధురాలు కళ్లెం అమృతమ్మను కలిసి వివరాలు సేకరించారు. అమృతమ్మ భర్త పదేళ్ల క్రితం మృతిచెందగా, అప్పటినుంచి కొడుకుల ఆదరణ కరువైందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం బాధితురాలి కుమారులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డికి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి, అమృతమ్మకు తగిన సాయం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆర్‌ఐ నాగరాజు తెలిపారు.

ఆ ఒక్కడే.. అధిపతి

- కోరుట్ల నుంచి ఐదుగురు కీలక మావో నేతలు
- చివరికి మిగిలింది తిప్పిరి తిరుపతే
- దక్కిన దళపతి పీఠం



తిప్పిరి తిరుపతి (ఫైల్)

కోరుట్ల: పీపుల్స్‌వార్ నుంచి మావోయిస్టులుగా రూపు మార్చుకున్న నక్సల్ ఉద్యమ పంథాతో కోరుట్లకు 50 ఏళ్ల విడదీయరాని అనుబంధం ఉంది. 1980–85 మధ్యకాలం కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా భారతీయ విద్యార్థి పరిషత్, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్లు విద్యార్థి వర్గాల్లో తమ ఊపును కొనసాగించాయి. ఈ రెండు విద్యార్థి సంఘాల మధ్య పరస్పర వైరుధ్యాలు, గొడవలు, కొట్లాటలు, ఓ దశలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ సమయంలోనే ఐదుగురు ఆర్‌ఎస్‌యూ నాయకులు పీపుల్స్‌వార్ వైపు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆ ఐదుగురు కీలక నేతలుగా ఎదగగా.. వారిలో ఇద్దరి ఆచూకీ లేదు. మరో ఇద్దరు వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. ఇక మిగిలింది..తిప్పిరి తిరుపతి. ఆ ఒక్కనికే మావోయిస్టు దళపతి పీఠం దక్కింది.

ఐదుగురు కీలక నేతలే..

1980–90 దశకంలో కోరుట్లకు చెందిన ఆర్‌ఎస్‌యూ నేతలు తిప్పిరి తిరుపతి, ముక్కా వెంకటేశం, నిజాముద్దీన్, బెజ్జారపు కిషన్, పసుల రాంరెడ్డి కీలకంగా వ్యవహరించేవారు. ఇంటర్, డిగ్రీ పూర్తి అయ్యే సమయంలో వీరిపై పోలీసు నిర్బంధం పెరగడంతో సిద్ధాంతపరమైన భావజాలంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. పీపుల్స్‌వార్‌లో కీలక నేతలుగా ఎదిగారు. ముక్కా వెంకటేశం నల్గొండ జిల్లా పీపుల్స్‌వార్ కార్యదర్శిగా పనిచేస్తూ 1996 అక్టోబర్‌లో యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్తున్న సమయంలో పోలీసుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. పసుల రాంరెడ్డి ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కార్యదర్శి హోదాలో 2001లో సిరిసిల్ల జిల్లా మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. నిజాముద్దీన్ మావోయిస్టు డెన్ కీపర్‌గా చాలారోజులు వ్యవహరించినట్లు సమాచారం. ఈ మధ్యకాలంలో నిజాముద్దీన్ ఆచూకీ ఎవరికీ తెలియడం లేదు. అసలు ఉద్యమంలో ఉన్నాడా..? లేడా..? అనే వివరాలు లేవు. బెజ్జారపు కిషన్ 1980–85లో బుల్లెట్ మోటార్‌సైకిల్ మెకానిక్‌గా కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో గుర్తింపు పొందారు. పీపుల్స్‌వార్‌లో చేరిన ఈయన మావోయిస్టు కేంద్ర కమిటీలో టెక్ విభాగం కార్యకలాపాలను పర్యవేక్షించారని పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆయన ఆచూకీ లేదు. ఇక మిగిలిన తిప్పిరి తిరుపతి మహారాష్ట్ర, ఒడిశాల్లో దేవ్‌జీగా మావోయిస్టు కార్యకలాపాలు నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబుపై అలిపిరి వద్ద దాడి, దంతెవాడ సమీపంలో పోలీసులను హతమార్చిన సంఘటనలకు వ్యూహకర్తగా తిరుపతి పేరు పలుమార్లు వినవచ్చింది. కోరుట్లలో తమ్ముడు వెంకటి చనిపోయిన సమయంలోనూ తిరుపతి ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. కరోనా సమయంలో ఒడిశా పరిసరాల్లోని ఆదివాసీబిడ్డ, ఉద్యమ సహచరి సృజనను ఆయన జీవిత భాగస్వామిగా చేసుకున్నట్లు సమాచారం. 2019–20లో కరోనా సమయంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతి చెందింది. అట్టడుగు స్థాయి నుంచి అధిపతి వరకు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా మావో సిద్ధాంతలక్ష్యాలను వీడని తిరుపతికి మావోయిస్టు దళపతి పీఠం దక్కడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.



నిజాముద్దీన్ (ఫైల్)



పసుల రాంరెడ్డి (ఫైల్)



బెజ్జారపు కిషన్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో తగ్గిన గ్రానైట్ కంపెనీల పన్ను ఎగవేత

- రూ.129 కోట్లకు చేరిన సీనరేజ్, డీఎంఎఫ్ బకాయిలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ కంపెనీలు పన్నుల ఎగవేత ధోరణిలో మార్పు కనిపిస్తోంది. గతంలో ఉమ్మడి జిల్లాలో గ్రానైట్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజ్, రాయల్టీ, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌ను ఎగ్గొట్టాయి. కొన్ని కంపెనీలు రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ డిపార్ట్ మెంట్ ఇచ్చిన నోటీసులకూ స్పందించ లేదు. రాష్ట్రానికి ఎలాంటి ట్యాక్స్ చెల్లించకుండానే రైల్వే రేక్ ల ద్వారా గ్రానైట్‌ను ఇతర రాష్ట్రాలకు, అక్కడి నుంచి విదేశాలకు యథేచ్ఛగా తరలిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రానైట్ కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజీ, రాయల్టీ చార్జీల్లో రూ.129 కోట్లు బకాయి ఉన్నట్లు ఆ శాఖ ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) చెన్నై బెంచ్‌కు ఓ కేసు నిమిత్తం సమర్పించిన రిపోర్టులో పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో గ్రానైట్ కంపెనీలు నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు ఆ నివేదికలో వెలడించింది. గతంలో ఈ బకాయిలు రూ.152 కోట్లుగా ఉండగా, ప్రస్తుతం పలు కంపెనీలు తమ బకాయిలు చెల్లించేందుకు ముందుకు వస్తుండటంతో ప్రస్తుతం ఆ బకాయిలు రూ.129 కోట్లకు చేరాయి.

నరేందర్‌రెడ్డికి అవార్డు



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి(కరీంనగర్): ముప్పై ఐదేళ్లుగా విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.నరేందర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక 'అవుట్‌స్టాండింగ్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్' అవార్డు వరించింది. ఢిల్లీకి చెందిన ఇండియన్ స్కూల్ అవార్డ్స్, వరల్డ్ ట్రేడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా అవార్డు ప్రకటించాయి. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వీఎస్‌ఆర్ తరుపున అల్ఫోర్స్ విద్యా సంస్థల ప్రతినిధి అవార్డును అందుకున్నారు. అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో నరేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అవార్డు బాధ్యత పెంచిందని, రానున్న రోజుల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా రాష్ట్ర విద్యారంగానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచేలా కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి కేజీబీవీలో ఏసీబీ తనిఖీలు



బోయినపల్లి కేజీబీవీ

బోయినపల్లి(చొప్పదండి): రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి కేజీబీవీలో బుధవారం ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4:20 గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. లీగల్ మెట్రాలజీ, శానిటరీ, ఫుడ్, ఆడిటర్ అధికారులు అధికారులు పాల్గొన్నారు. కేజీబీవీలో ఆహార నాణ్యత, పరిమాణం, పారిశుధ్య పరిస్థితులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, టీచింగ్, నాన్ టీచింగ్ రికార్డులు తనిఖీ చేశారు. వంటగది అపరిశుభ్రంగా ఉండడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సరిగా లేదని, పాఠశాల క్యాష్ బుక్ ఎంట్రీలను అప్‌డేట్ చేయలేదని గుర్తించారు. కొన్ని అనవసర కొనుగోళ్లు చేయడంతో పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. కాగా బోయినపల్లి కేజీబీవీలో అవకతవకలు జరుగుతున్నాయని, అమ్మ ఆదర్శ కమిటీ నిధులు గోల్‌మాల్ చేశారని ఫిర్యాదులు అందడంతో తనిఖీలు చేసినట్లు తెలిసింది. పలు టెండర్లను కేజీబీవీలో పనిచేసే ఉద్యోగుల బంధువులకే ఇచ్చారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఏసీబీ అధికారులు ప్రకటనలో తెలిపారు.

కాళేశ్వరం దోపిడీ రూ.లక్షా 15 వేల కోట్లు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్‌కార్పొరేషన్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కేసీఆర్ కుటుంబం రూ.లక్షా 15 వేల కోట్లు దోచుకుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం ధ్వజమెత్తారు. బుధవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూ.35 వేల కోట్లతో పూర్తయితే, రూ.1లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసినట్లు కేసీఆర్ చెబుతున్నారన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని కవిత చెప్పారని, అవినీతి వాస్తవాలు సొంత కుటుంబం నుంచే వస్తుంటే, కేటీఆర్ సీఎంపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయం నిర్మిస్తున్న సమయంలో దొరికిన నిజాంకు చెందిన బంగారం, వజ్రాలు, హైదరాబాద్ చుట్టూ కేసీఆర్ బినామీ పేరిట ఉన్న 30 వేల ఎకరాల భూములు, ఆస్తుల పంపకాల్లో కేటీఆర్‌తో సమానంగా తనకు వాటా కావాలనే కవిత పంచాయితీ మొదలైందని ఆరోపించారు. తెలంగాణ వస్తే ఉద్యమకారులకు ఉద్యోగాలు రాలేదని, కేసీఆర్ కుటుంబం మాత్రం రూ.3 లక్షల కోట్లు దండుకుందని మండిపడ్డారు. గతంలో ఇళ్లు కూడా సరిగాలేని కేసీఆర్ కుటుంబానికి అమెరికా, దుబాయి, లండన్, సింగాపూర్‌లో రూ.వేలకోట్ల ఆస్తులు, వ్యాపారాలు ఎక్కడివని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు సముద్రాల అజయ్, గోష్కి శంకర్ పాల్గొన్నారు.

సంఘటితంగా ముందుకెళ్లాలి

కరీంనగర్: అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా రాజ్యాంగ ఫలాలను పునికి పుచ్చుకునేందుకు సంఘటిత శక్తితో ముందుకు సాగాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా అంబేద్కర్ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. రాజకీయ పార్టీల్లో ఉన్న దళిత వర్గాలు దళిత శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని, పొరపచ్చాలు లేకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు గజ్జల ఆనంద్‌రావు, సుద్దాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా రెస్క్యూ బ్రిగేడియర్ల మార్చ్‌ఫాస్ట్



రెస్క్యూ కోసం గనిలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ప్రతినిధులు

అట్టహాసంగా రెస్క్యూ పోటీలు

గోదావరిఖని: సింగరేణి 54వ జోనల్ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలు బుధవారం మెయిన్ రెస్క్యూస్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 6 పురుషులు, 2 మహిళా జట్లు హాజరయ్యాయి. సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఎంఎస్ ఉమేశ్ సావర్కర్ పోటీలు ప్రారంభించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రతినిధులను నాగ్‌పూర్ జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం శ్రీనివాస్, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్జీ –1, 3 జీఎంలు లలిత్‌కుమార్, సుధాకర్‌రావు, డీడీఎంఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఫస్ట్‌ఎయిడ్ పోటీల్లో ప్రతినిధులు

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన చైన్ స్నాచింగ్ నిందితులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకవ్వ అనే వృద్ధురాలి మెడలోంచి గుర్తుతెలియని దొంగలు రెండుంపావు తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. వెంకవ్వ బుధవారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి ముందు ప్లేట్ కడుగుతుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెను మాటల్లో దింపి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. రూరల్ ఎస్సై సదాకర్ సంఘటన స్థలానికి చేరుకుని ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు సీసీఫుటేజీలో రికార్డు అయింది. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేయండి



ధర్మపురి గోదావరిలో పుష్కరఘట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి: రానున్న గోదావరి పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేయాలని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గోదావరిలోగల పుష్కర ఘాట్లను బుధవారం దేవాదాయశాఖ కమిషనర్ శైలజారామయ్యర్‌తో కలిసి పరిశీలించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు రానున్నందున సరిపడా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల పనులపై ప్రణాళిక సిద్ధం చేసి త్వరగా పంపించాలని అన్నారు. గోదావరిలో గతంలో ఏర్పాటు చేసిన పుష్కరఘాట్లతో పాటు మరికొని ఘాట్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో పరిశీలన చేసి ముందుకుసాగాలన్నారు. మంగళిగడ్డ, సంతోషిమాత, సోమవిహార్ పుష్కర్‌ఘాట్లతోపాటు గడ్డ హన్మాండ్ల ఆలయం వద్ద పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో శ్రీనివాస్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావ్ తదితరులున్నారు.

కిడ్నాపర్ల అరెస్ట్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని మైత్రీ హోటల్ సమీపంలో కిడ్నాపర్లను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. నిష్మారి యశ్వంత్(ఛత్తీస్‌గఢ్)కు రెండేళ్ల క్రితం నల్లపాటి నరేశ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో గ్రానైట్‌కు సంబంధించిన వ్యాపారం చేసేందుకు ఒరిస్సాకు చెందిన వ్యక్తిని యశ్వంత్ పరిచయం చేశాడు. దీంతో రూ.3లక్షలు ఒరిస్సాకు చెందిన వ్యక్తికి మధు ఇచ్చాడు. అతడు ఆ డబ్బులు ఎంతకు తిరిగి ఇవ్వకపోగా.. మధ్యవర్తిగా ఉన్న నువ్వే ఇవ్వాలని యశ్వంత్‌పై ఒత్తిడి తెచ్చాడు. కరీంనగర్‌కు వస్తున్నానని అక్కడ మాట్లాడుకుందామని చెప్పాడు. అనుకున్నట్లే ఈనెల 7న కరీంనగర్‌కు వచ్చిన యశ్వంత్‌ను భోజనం చేసుకుంటూ మాట్లాడుకుందాం రమ్మని కొత్తపల్లికి నరేశ్ పిలిచాడు. దీంతో యశ్వంత్, ముద్దుల మధు(భద్రాచలం) కొత్తపల్లికి రాగా.. వారిని నల్లపాటి నరేశ్‌తోపాటు మరో నలుగురు గుడిమల్ల సివిల్, తునికిపాటి శేఖర్, ఆలకుంట ఉపేందర్, ఆలకుంట అశోక్ కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మధు, ఖమ్మం వెళ్లే క్రమంలో యశ్వంత్ తప్పించుకున్నారు. కిడ్నాప్‌తో భయపడ్డ యశ్వంత్, మధు కొంత డబ్బును చెల్లించారు. ఈ విషయాన్ని యశ్వంత్ అల్లుడు కొత్తపల్లి పోలీసులకు సమాచారమివ్వగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కిడ్నాప్‌కు పాల్పడ్డ నల్లపాటి నరేశ్, గుడిమల్ల సివిల్, తునికిపాటి శేఖర్, ఆలకుంట ఉపేందర్, ఆలకుంట అశోక్ అనే నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కార్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో ఉన్న మరికొంతమందిని కూడా పట్టుకుంటామని సీఐ కోటేశ్వర్ పేర్కొన్నారు. 48 గంటల్లో కేసును ఛేదించి నేరస్తులను అదుపులోకి తీసుకున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్, ఎస్సైలు సాంబమూర్తి, సంజీవ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

పాఠశాలల నిర్వహణకు నిధులు

- కనీస వసతుల కల్పన, స్వచ్ఛతపై దృష్టి
- అమ్మ ఆదర్శ కమిటీ తీర్మానాలతో వినియోగం
- ఉమ్మడి జిల్లాకు రూ.5.32 కోట్లు

జిల్లాల వారీగా విడుదలైన నిధులు

జిల్లా	పాఠశాలలు	నిధులు
కరీంనగర్	542	1,25,95,000
జగిత్యాల	677	1,81,75,000
పెద్దపల్లి	450	1,03,01000
రాజన్నసిరిసిల్ల	446	1,22,02000
మొత్తం	2,115	5,32,73,000



ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కరీంనగర్: ప్రభుత్వ బడుల నిర్వహణకు నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఈనెల 8న ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలలతో పాటు కస్తూరిబాగాంధీ విద్యాలయాలు, గిరిజన సంక్షేమ పాఠశాలలకు కంపోజిట్ స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్ మంజూరు చేశారు. పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు, స్వచ్ఛత, ఇతరత్రా పనులకు నిధులు వినియోగించుకునేందుకు అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాల్లో త్వరలో జమకానున్నాయి. మార్గదర్శకాలకు అనుగుణంగా అమ్మ ఆదర్శ కమిటీ తీర్మానంతో ఈ నిధులు వినియోగించాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు నిధులను సద్వినియోగం చేసి యుటిలైజేషన్ సర్టిఫికెట్(యూసీ)లను సమర్పించాలి. నిధుల వినియోగంపై ఆడిట్ ఉంటుంది.

ఇలా ఖర్చు పెట్టాలి

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు సంయుక్తంగా వారి పేరున ఉన్న జాయింట్ ఖాతాలో నిధులు జమవుతాయి. కమిటీ తీర్మానం మేరకు చాక్‌పీస్‌లు, తెల్లకాగితాలు, రిజిస్టర్లు తదితర స్టేషనరీ సామగ్రి, పరీక్షల నిర్వహణ, జాతీయ పండగల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, కేయాన్, టీవీ మరమ్మతులు, కొనుగోలు, కేబుల్, ఇంటర్నెట్ చార్జీలు, డిజిటల్ తరగతుల నిర్వహణ ఖర్చులు, ప్రయోగశాలల పరికరాల కొనుగోలు, పాఠశాల భవనాల చిన్నచిన్న మరమ్మతులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిధుల్లో 10 శాతం పాఠశాల ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమానికి విధిగా ఖర్చు చేయాలన్న నిబంధన ఉంది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నిర్వహణ నిమిత్తం విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన ఈ నిధులు విడుదల చేస్తారు. గతంలో ఎస్‌ఎస్‌ఏ, ఆర్‌ఎంఎస్‌ఏ నిధులు వేర్వేరుగా వచ్చేవి. ఈ రెండింటినీ కలిపి సమగ్రశిక్షగా మార్చి విలీనం చేశారు. సమగ్ర శిక్ష నుంచే నిధులు కేటాయిస్తున్నారు. 1–30 మంది విద్యార్థులుంటే రూ.10 వేలు, 31–100 మందికి రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి మందికి రూ.75 వేలు, వెయ్యికిపైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రూ.లక్ష నిధులు మంజూరు చేశారు. వీటిలో తొలివిడతగా 50 శాతం నిధులు విడుదల చేస్తూ అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాల్లోకి నేరుగా జమ అయ్యేలా చర్యలు చేపట్టారు. కాగా, కొన్ని నెలలుగా పాఠశాలల ఆవరణ శుభ్రం చేయించడం, శానిటైజేషన్, ఇతర వాటికి గతంలో ఇచ్చిన నిధులు సరిపోక కొందరు ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేశారు. ఎట్టకేలకు స్కూల్ గ్రాంట్ నిర్వహణ నిధులు విడుదల కావడంతో ప్రధానోపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమవుతుంది.